నేటి నుంచి డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వే


అధికారులతో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సమీక్ష

న్యూస్‌టుడే,మెదక్: రేషన్, ఆరోగ్య కార్డుల స్థానంలో సంక్షేమ పథకాలు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇవ్వనుంది. ఇందులో భాగంగా ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయనున్నారు. ఈ మేరకు పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలో రెండు గ్రామాలు, రెండు మున్సిపల్ వార్డులను ఎంపిక చేశారు. జిల్లాలో 21 మండలాలు, నాలుగు పురపాలికలున్నాయి. వీటిలో 2.14 లక్షల కుటుంబాలున్నాయి. ప్రస్తుతం రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ పథకానికి కార్డులు ఉన్నాయి. రేషన్ కార్డు లేని వారు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అన్నింటికి ఒకే కార్డు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు డిజిటల్ ఫ్యామిలీ కార్డు ఇవ్వనున్నారు.

రెండేసి చొప్పున ఎంపిక..:

డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వే జిల్లాలో గురువారం ప్రారంభమై ఈనెల7వ తేదీ వరకు సాగనుంది. జిల్లాలో చిన్నశంకరంపేట మండలం కామారం , నర్సాపూర్ మండలం గొల్లపల్లి మెదక్ పట్టణంలో 20 వ వార్డు, నర్సాపూర్‌లో 8వ వార్డులో సర్వే నిర్వహించనున్నారు. ఒక్కో బృందంలో నలుగురు అధికారులు చొప్పున 11 బృందాలను ఏర్పాటు చేశారు. సర్వే సందర్భంగా ఆయా కుటుంబాల్లో పుట్టిన, మరణించిన వారి వివరాలు తీసుకొని నమోదు చేయనున్నారు. ఇందుకు సంబంధించి రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా పక్కా ప్రణాళికతో సర్వే చేపట్టనున్నామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు చెప్పారు. 11 బృందాలను ఏర్పాటు చేశామని, ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



మెదక్, న్యూస్‌టుడే: డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన బుధవారం మెదక్‌లో నిర్వహించారు. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులకు 1:3 ప్రకారం ఎంపికైన అభ్యర్థులను ఆహ్వానించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ అధికారులు అభ్యర్థుల పత్రాలను పరిశీలించారు. మొత్తం 384 మంది అభ్యర్థులకు 275 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పర్యవేక్షించారు.


భూ నిర్వాసితులతో నేటి నుంచి సమావేశాలు: ఆర్డీవో

నర్సాపూర్, న్యూస్‌టుడే: ప్రాంతీయ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న నర్సాపూర్, శివ్వంపేట మండలాలకు చెందిన వివిధ గ్రామాల నిర్వాసితులతో గురువారం నుంచి ఈనెల 7వ తేదీ వరకు పట్టణంలోని రైతువేదికలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులు అసలు, నకలు పత్రాలు, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్, పాన్ కార్డుతో ఆ రోజు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు. నర్సాపూర్ మండలం మహ్మదాబాద్ జాన్సింపేట, తిర్మలాపూర్ గ్రామాల రైతులతో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, అదే రోజు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తుజాల్‌పూర్, పెద్దచింతకుంట గ్రామాల రైతులకు, శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మూసాపేట, నాగులపల్లి గ్రామాలు, చిన్నచింతకుంట, రెడ్డిపల్లి గ్రామాలకు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ సమావేశాలు ఉంటాయని చెప్పారు. శివ్వంపేట మండలం ఉసిరికపల్లి, గుండ్లపల్లి, కొత్తపేట్ గ్రామాల రైతులకు 5వ తేదీ ఉదయం సమావేశాలు ఉంటాయన్నారు.

జలం..పుష్కలం

జిల్లాలో భూగర్భ జల మట్టం (మీటర్లలో)

ప్రాంతం	ఆగస్టు	సెప్టెంబరు
సికింద్లాపూర్	2.35	1.08
మల్కాపూర్	3.74	1.10
పిల్లికొట్టాల్	2.10	1.55
ఇస్లాంపూర్	2.74	2.18
ఎల్లుపేట	6.50	2.98
కూచన్‌పల్లి	4.55	3.29
రామాయపల్లి	9.07	3.37
పొడ్చన్‌పల్లి	5.30	4.62
శివ్వంపేట	10.73	4.72
కొల్చారం	10.52	5.02
గవ్వలపల్లి	6.62	5.64



న్యూస్‌టుడే, మెదక్

వరుణుడి కరుణతో జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిశాయి. దీంతో వానాకాలం పంటలకు పూర్తి స్థాయిలో భరోసా లభించింది. భూగర్భ జలాలు పైపైకి వచ్చి యాసంగికి [illegible] మారాయి. జిల్లాలో జూన్ 1 నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 691.2 మి.మీ. ఉండగా, 847.0 మి.మీ. నమోదైంది. జిల్లాలోని ఆయా మండలాల్లో చెరువులు, కుంటలు అలుగు పారడంతో భూగర్భ జలమట్టం పైకి రావడం విశేషం. ప్రస్తుతం జిల్లా సగటు భూగర్భజలమట్టం 10.81 మీటర్లు ఉండగా, శివ్వంపేట మండలం సికింద్లాపూర్‌లో తక్కువ లోతులో 1.08 మీటర్లు ఉండగా, నార్సింగి మండలం కేంద్రంలో ఎక్కువ లోతులో నీళ్లు ఉన్నాయి. శివ్వంపేట, వెల్దుర్తి, తూప్రాన్, హవేలిఘనపూర్, టేక్మాల్, చిన్న శంకరంపేట, కొల్చారం మండలాల్లో 5 మీటర్లలోపే భూగర్భజలాలు ఉండటం గమనార్హం. గత నెల ఆగస్టుతో పోలిస్తే ఆయా ప్రాంతాల్లో సెప్టెంబరు వచ్చే సరికి భూగర్భ జలాలు పెరిగాయి. ఇప్పటికే జిల్లాలోని అన్ని మండలాల్లో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. నార్సింగిలో 23.89 మీటర్ల అడుగుల లోతులో నీళ్లు ఉండటం గమనార్హం.


సికింద్లాపూర్‌లో బోరులో సమృద్ధిగా నీరు

సాగుకు ఊతం: వానాకాలం ప్రారంభంలో సరైన వర్షాలు లేక రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ తరుణంలో ఎడతెరిపి లేకుండా కురవడంతో సాగుకు ఊతమిచ్చినట్లయింది. సాధారణం కంటే 22.5 మి.మీ. వర్షం ఎక్కువగా కురిసింది. జిల్లాలో 11 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, తొమ్మిది మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. వర్షాలతో చెరువులు, కుంటల్లోకి నీళ్లు చేరి భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. గత నెలలో కురిసిన వర్షాలు పంటలకు బలం చేకూరింది. మరో మూడు వారాల్లో వరి పంట చేతికి రానుంది. 2023లో సెప్టెంబరులో సగటు 8.18 మీటర్లు ఉండగా, ఈ ఏడాది 10.81 మీటర్లుగా నమోదైంది. ఈ ఏడాది జులైతో పోలిస్తే 3.38 మీటర్లకు తగ్గడం గమనార్హం.


కలెక్టరేట్‌లో నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు


ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, పోలీసుల అధికారులు


మెదక్‌లో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, పురపాలక అధ్యక్షుడు చంద్రపాల్


గోమారంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి..

గాంధీ ఆశయ సాధనకు కృషి

మెదక్, హవేలిఘనపూర్, మెదక్ అర్బన్, శివ్వంపేట న్యూస్‌టుడే: అహింసా పద్ధతిలో స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ అని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లో జాతిపిత జయంతి సందర్భంగా ఆయన నివాళులర్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. హవేలిఘనపూర్ బూర్గుపల్లిలో, మెదక్ పట్టణ రాందాస్ చౌరస్తాలో గాంధీ విగ్రహాలకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు నివాళులు అర్పించారు. క్యాంప్ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. బూరుగుపల్లి, గాజిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందించారు. శివ్వంపేట మండలం గోమారంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొన్నారు. భారాస కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. భాజపా ఆధ్వర్యంలో మెదక్ పట్టణ రాందాస్ చౌరస్తాలోని గాంధీ విగ్రహానికి, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ నివాళులర్పించారు.


లాల్‌బహుదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు

తూప్రాన్‌లో హైడ్రా గుబులు!

న్యూస్‌టుడే, తూప్రాన్:

● తూప్రాన్ పురపాలిక ఏబీ కాలనీలో ఓ వ్యక్తి ఏడాది కిందట ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆ సమయంలో ప్లాట్ పరిశీలనకు వచ్చిన అధికారి ఎఫ్‌టీఎల్‌లో ఉందని తిరస్కరించారు. అనంతరం ఓ వ్యక్తి ద్వారా నగదు తీసుకుని ఇంటి నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తవ్వగా, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోకి వస్తుందేమోనని యజమాని ఆందోళన చెందుతున్నాడు.

● ఇదే కాలనీలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఎఫ్‌టీఎల్‌లో ఉందని అధికారులు పనులను నిలిపివేశారు. ఆరు నెలల అనంతరం సదరు యజమాని రాజకీయ నాయకుడి సహకారంతో టీపీవో అధికారులకు నగదు అప్పగించి పనులు పూర్తి చేశారు. ఇలా ఈ కాలనీలో చాలా మంది రాజకీయ నాయకుల అండదండలతో అధికారులకు నగదు ఇచ్చి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. ఇపుడు ప్రభుత్వం హైడ్రాకు ప్రత్యేక అధికారులు ఇస్తూ ఆర్డీనెన్స్ జారీ చేయడంతో హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఇళ్లు నిర్మించిన వారు ఆందోళనకు గురవుతున్నారు.


చెరువు వద్ద పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

చెరువు సమీపంలో..: తూప్రాన్ పురపాలిక ఏబీ కాలనీలో కొంత భాగం పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. చెరువుకు అత్యంత సమీపంలో ఉండడంతో వరద ఇళ్ల మధ్యలో నిలుస్తోంది. పంచాయతీగా ఉన్న సమయంలో ఇక్కడ వెంచర్ ఏర్పాటు చేశారు, ఆ సమయంలో వెనుక భాగంలో ఉన్న ప్లాట్లు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని అప్పటి రెవెన్యూ అధికారులు వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు నిరాకరించారు. ఓ అధికారి మాత్రం ఈ వెంచర్‌తోపాటు, వెనుక భాగంలో కొత్తగా ఏర్పాటు చేసిన వెంచర్‌ను సైతం వ్యవసాయేతర భూమిగా మార్చి ప్లాట్లు చేసుకునే సౌకర్యం కల్పించారు. దీంతో చాలా మంది ప్లాట్లను కొనుగోలు చేశారు. కొంత మంది ఎఫ్‌టీఎల్‌లోనే నిర్మించుకుని నివసిస్తున్నారు. పురపాలికగా ఏర్పాటయ్యాక నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లకు అనుమతులు ఇచ్చారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలను సర్వే చేస్తుండడంతో తమ ఇళ్లు సైతం వాటి పరిధిలోకి వస్తాయేమోనని భయాందోళన చెందుతున్నారు.


పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఇళ్ల నిర్మాణాలు

ఇళ్ల మధ్యలో నీరు: తూప్రాన్ పెద్ద చెరువు నిండితే నర్సాపూర్ వెళ్లే ప్రధాన రహదారి వరకు నీరు నిలుస్తోంది. దీంతో చాలా ఇళ్లు, ప్లాట్ల మధ్యలోనే నీరు నిలుస్తోంది. హైదరాబాద్ జంట నగరాల్లో హైడ్రా అధికారులు కూల్చివేతలు ప్రారంభించడంతో తూప్రాన్‌లోనూ గుబులు మొదలైంది. మరోవైపు అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే పనులను ముమ్మరం చేస్తున్నారు. పట్టణంలోని అవుసులవాని కుంట పరిధిలోనూ నిర్మాణాలు చేపట్టారని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

సంయుక్త సర్వే చేపడతాం:

– విజయలక్ష్మి, తహసీల్దార్, తూప్రాన్

తూప్రాన్ మండలంలో 138 చెరువులు, కుంటలు ఉన్నట్లు గుర్తించాం. రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారుల ఆధ్వర్యంలో సంయుక్త సర్వే చేపడుతాం. గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది. త్వరలో తూప్రాన్ పట్టణంలోనూ చేపట్టి తుది నివేదిక అందజేస్తాం.

పనులు ప్రారంభించిన అధికారులు

ఈనాడు కథనానికి స్పందన

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: మెదక్ పురపాలిక పరిధి రాందాస్ చౌరస్తా వద్ద రూ.3 కోట్లతో చేపట్టిన వాణిజ్య సముదాయం పనులు నిలిచి పోయాయి. దీనిపై జులై 19వ తేదీన 'రెండేళ్లుగా పిల్లర్ల దశలోనే' అనే శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మెదక్ పురపాలిక పాలకవర్గం సభ్యులు, అధికారులు సంబంధిత గుత్తేదారుతో మాట్లాడి పనులను ప్రారంభించేలా చేశారు.

కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

శివ్వంపేట, న్యూస్‌టుడే: కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం మంత్రి కొండా సురేఖకు తగదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శివ్వంపేట మండలం గోమారంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మహిళను కించపరిచేలా మాట్లాడడం బాధాకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాపై వ్యాఖ్యానించినప్పుడు, మేము మహిళలమన్న విషయం మరిచారా అని ప్రశ్నించారు.

పార్శ్వనాథుడి విగ్రహం లభ్యం

టేక్మాల్: టేక్మాల్ మండలం వెల్పుగొండ గుట్టపై ప్రాచీన ఏకశిల పార్శ్వనాథుడి విగ్రహాన్ని ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. స్థానిక పోలీసులు దర్యాప్తు చేపట్టి విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. వెల్పుగొండ తుంబురీశ్వర ఆలయానికి సమీపంలోని చెరువు మధ్యలో ఉన్న గుట్టపై పార్శ్వనాథుడి విగ్రహం ఉండేది. ఆగస్టు 30వ తేదీన విగ్రహం కనిపించకుండా పోవడంతో, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు విచారణ చేపట్టి, విజయవాడ ప్రాంతంలో స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసులను వివరణ కోరగా త్వరలో నిందితులను పట్టుకుంటామన్నారు.

కొలువుదీరే అమ్మ.. భక్తితో కొలిచేమమ్మా


ప్రతిష్టకు తరలించిన దుర్గామాత

జిల్లాలో నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా పలు ఆలయాలను విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించే మండపాలను ముస్తాబు చేశారు. అమ్మవారు ప్రతిరోజు ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతి రోజు ప్రత్యేక పూజలు చేయనున్నారు. – న్యూస్‌టుడే, బృందం


పట్టణంలోని ఓ మండపం వద్ద విద్యుత్తు దీపాల అలంకరణ


రామోజీపల్లి సిద్ధమవుతున్న మండపం

సమస్యలు పరిష్కరించండి: భారాస

గజ్వేల్, న్యూస్‌టుడే: భారాస నేతలను విమర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులకు పేదలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌ను నోటికొచ్చినట్లు మాట్లాడటం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి మంజూరు చేసిన రూ.170 కోట్ల నిధులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని, స్థానిక నాయకులు బాధ్యత తీసుకొని పనులు చేపడితే బాగుంటుందని అన్నారు. ఆరు గ్యారెంటీలపై ప్రజలు నిలదీస్తారనే భయంతో హైడ్రాను తీసుకొచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి: ఎస్పీ

మెదక్, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తామని ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని సూచించారు. విజన్ సంస్థ డైరెక్టర్ కైలాష్, శ్రీనివాస్, ప్రసాద్, మహేందర్, పాతూరి రాజు పాల్గొన్నారు.

తీరొక్క పూలతో.. బతుకమ్మను తీర్చిదిద్ది..


మెదక్ కోదండ రామాలయంలో ..

ప్రకృతి పండుగ, తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా తీరొక్క పూలతో బతుకమ్మను తీర్చిదిద్ది కొలిచారు. మెదక్ కోదండ రామాలయం, బాలాజీ మఠం, వివిధ కాలనీల్లో మహిళలు బతుకమ్మ ఆడి పాడారు. పట్టణ వీరహనుమాన్ కాలనీలో మహిళలు ఒకే రకమైన చీరలు ధరించి సందడి చేశారు. – న్యూస్‌టుడే మెదక్ అర్బన్


మెదక్ పట్టణ వీర హనుమాన్ కాలనీలో కోలాటం పడుతున్న మహిళలు

పేదలకు సేవ చేయడం అదృష్టం



సేఫ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో పుర ఛైర్మన్ చంద్రపాల్

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పేదలకు సేవ చేయాలనుకోవడం మంచి ఆలోచన అని మెదక్ పురపాలిక అధ్యక్షుడు చంద్రపాల్ పేర్కొన్నారు. సేఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని నీటి ట్యాంకులకు ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ క్లోరినేషన్ అండ్ ఆన్‌లైన్ మానిటరింగ్ (ఆకోమ్) వ్యవస్థను బుధవారం ఆ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా 12వ వార్డులోని రెండు పడకల గదుల కాలనీలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. దేశంలో చాలా మంది కోటీశ్వర్లున్నా అమెరికా నుంచి సేవ చేసేందుకు సంస్థ ప్రతినిధులు రావడం చాలా సంతోషకరమన్నారు. కలుషితమైన నీటితో ప్రజలు రోగాల భారిన పడుతున్నారని గ్రహించి, క్లోరినేషన్ చేసేందుకు ఉచితంగా యంత్రాలను ఏర్పాటు చేసి పర్యవేక్షణకు సిబ్బందిని నియమించారని గుర్తు చేశారు.సమావేశంలో సేఫ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు క్రిస్, సిబ్బంది పవన్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేక.. నిస్తేజంగా మారి..


కేంద్రం వద్ద ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బంది

న్యూస్‌టుడే, నర్సాపూర్: ఉద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం నర్సాపూర్‌లో జీవనోపాధుల వనరుల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. వీటి ద్వారా వివిధ అంశాలపై వారికి శిక్షణ ఇచ్చి, మెరుగైన సేవలు అందించేలా సిద్ధం చేయాలన్నది లక్ష్యం. ప్రస్తుతం నిధుల లేమితో ఈ కేంద్రం నిస్తేజంగా మారింది. 2000లో కేంద్రాన్ని రూ.25 లక్షలు వ్యయం చేసి నిర్మించారు. పథకాల అమలులో అధికారులు, సిబ్బందికి తర్ఫీదు ఇచ్చేందుకు వీలుగా విశాలమైన సమావేశ మందిరం, కార్యాలయం, కంప్యూటర్ గది నిర్మించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు అనుగుణంగా ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా, వారి బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. కొన్నేళ్ల పాటు సజావుగా సాగినా, కాలక్రమేణా శిక్షణలు ఆగిపోయాయి.

ఉమ్మడి జిల్లా పరిధి..:

నర్సాపూర్‌లో నిర్మించిన భవనంలో ఉమ్మడి జిల్లాలోని నర్సాపూర్, హత్నూర, శివ్వంపేట, కౌడిపల్లి, జిన్నారం, పటాన్‌చెరు, మెదక్, వెల్దుర్తి, కొల్చారం, పాపన్నపేట, శంకరంపేట(ఆర్), సంగారెడ్డి, కొండాపూర్, సదాశివపేట, పుల్కల్ మండలాల పరిధిలో సేవలందించారు. అటవీ, ఉపాధి హామీ పథకం, ఇందిర జలప్రభ, వాటర్ షెడ్, సర్పంచులకు, వివిధ కార్యక్రమాలకు సంబంధించిన శిక్షణలు ఇచ్చేవారు. ఇందు కోసం ఏటా రూ.10లక్షలు కేటాయించారు. శిక్షణకు హాజరైనవారికి అల్పాహారం, టీ, స్నాక్స్, మధ్యాహ్నం భోజనం అందించేవారు. అయితే నిధుల విడుదలలో జాప్యం కారణంగా కార్యక్రమాలు తగ్గిస్తూ వచ్చారు.

ఐసీడీఎస్‌కు కేటాయించి:

నర్సాపూర్‌లో జూనియర్ సివిల్ కోర్టు భవనం కూలిపోవడంతో దానిని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలోకి తరలించారు. ఐసీడీఎస్ కార్యాలయాన్ని ప్రాంతీయ జీవనోపాధుల వనరుల కేంద్రంలోకి మార్చారు. కేంద్రాన్ని తాత్కాలికంగా ఆర్‌డబ్ల్యూఎస్ పాత భవనంలోకి మార్చారు. ఇది పూర్తిగా శిథిలావస్థకు చేరడం. కోతులకు ఆవాసంగా మారడంతో కార్యాలయంలో ఎప్పుడూ, ఒక అటెండర్ మినహా ఒక్క అధికారి ఉండడం లేదు. మెదక్ ఏపీడీ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. సిబ్బంది కూడా బదిలీ అయ్యారు. ఈ విషయాన్ని కేంద్రం అధికారి బాలయ్య వద్ద ప్రస్తావించగా బడ్జెట్ కేటాయించకపోవడంతో శిక్షణ నిలిపివేశాం. కనీసం కరెంటు బిల్లు చెల్లించడం కూడా కష్టంగా ఉంది. ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి ముందుకు వెళతామని పేర్కొన్నారు.

నైపుణ్యాల మెరుగుకు శిబిరాలు దోహదం


శిక్షణ పొందుతున్న విద్యార్థులతో శోభన్‌బాబు

నర్సాపూర్, న్యూస్‌టుడే: నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు క్రీడాకారులకు శిక్షణ శిబిరాలు దోహదపడతాయని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్‌బాబు అన్నారు. నర్సాపూర్ అల్లూరి సీతారామరాజు గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైన వారికి జరుగుతున్న శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలలో జరిగే 42వ జాతీయ స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొనే జట్టుకు శిక్షణ శిబిరం చేపట్టామన్నారు. క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. అంతర్జాతీయ క్రీడాకారుడు అభిషేక్‌గౌడ్, శిక్షకులు ప్రసన్న, జిల్లా ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్, శ్యాంసుందర్, నవీన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వర్గల్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డి.రాజేందర్ పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో వర్గల్ నవోదయలో ఖాళీగా ఉన్న సీట్లలో చేరేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిదో తరగతిలో చేరేందుకు ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు, 11లో చేరేందుకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్లైన్ shttps:-///www.navodaya.gov.inzలో ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025, ఫిబ్రవరి 8న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఏడుగురు గంజాయి విక్రేతల అరెస్టు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: గంజాయి దమ్ము పీల్చుతూ జల్సాలకు అలవాటై దానిని ఇతరులకు అమ్ముతున్న యువకుడు పోలీసులకు పట్టుబడ్డాడు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని కేసీఆర్‌నగర్‌కు చెందిన శశివర్ధన్, షాదుల్, నివాస్, వారి స్నేహితులతో కలిసి విశాఖపట్నంలో ఓ వ్యక్తి వద్ద గంజాయి కొంటున్నారు. గంజాయిని బుధవారం సిద్దిపేటలోని కేసీఆర్‌నగర్‌లో విక్రయించే క్రమంలో పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. ఈ క్రమంలో శశివర్ధన్‌ను అదుపులోకి తీసుకున్నారు. షాదుల్, నివాస్ పరారయ్యారు. స్నేహితులు సురేశ్, రఘువంశీ, దయాకర్, లక్ష్మణ్, చాంద్‌పాషా, రోహిత్‌లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 1040 గ్రాముల ఎండు గంజాయి, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు.

దేవీ శరణం గచ్ఛామి

● నేటి నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం

ఆధ్యాత్మిక శక్తి.. ప్రపంచాన్ని ముందడుగు వేసేలా చేస్తోంది. శక్తికి మరోపేరు అమ్మవారు. అమ్మవారిని ఏకాగ్రచిత్తంతో ఆరాధిస్తే ధైర్యం ఆవహిస్తుంది. మంచి పనులకు మనసును పురిగొల్పుతుంది. నేటి నుంచి దశమి వరకు శరన్నవారోత్సవాల్లో దుర్గామాత, సరస్వతి మాత క్షేత్రాల్లో రోజుకో రకంగా దివ్యమైన పూజలు జరుగుతాయి. భక్తులు దీక్ష తీసుకొని మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి అర్చిస్తారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలోని ముఖ్య ఆలయాలు, మండపాలు వాటి ప్రత్యేకతలపై కథనం.



చిట్కుల్‌లో చాముండేశ్వరి

శాంతస్వరూపిణి

చిలప్‌చెడ్: మంజీరా నదీ తీరంలో చాముండేశ్వరిదేవి గుడి విలసిల్లుతోంది. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామంలో శాంతిస్వరూపిణిగా చాముండి దర్శనం ఇవ్వడం విశేషం. నేడు మొదటి రోజున వేయి కడవల నది నీటితో అభిషేకిస్తారు. నిత్యం పారాయణాలు నిర్వహిస్తారు.

మహిళలే ముందుకు..



మహంకాళి మందిరం

తూప్రాన్, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో కులాలతో సంబంధం లేకుండా సమష్టిగా ఉత్సవాల నిర్వహణ ఇక్కడ ప్రత్యేకత. నిమజ్జనం రోజు ప్రధానంగా మహిళలే భాగస్వాములై కోలాటాలతో శోభాయాత్ర చేపడతారు. మహంకాళి దేవాలయ ఆవరణంలో 26 సంవత్సరాలుగా నవరాత్రోత్సవాలను నిర్వహిస్తున్నారు. 90 మంది భక్తులు దీక్షలో ఉంటారు.

గడికోట వైభవం

పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటలోని చారిత్రక శంకరమ్మ గడికోటను కొన్నేళ్ల క్రితం గ్రామస్థులు మరమ్మతులు చేసి వాడుకలోకి తెచ్చుకున్నారు. అందులోభాగంగా గడికోట ఉత్సవ సమితిగా ఏర్పడి నవరాత్రోత్సవాలను నిర్వహిస్తున్నారు. కోటలో అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. బోనాలు, ప్రస్తుత ఉత్సవాలతో ఈ కోట శిథిలం కాకుండా చారిత్రక సాక్ష్యంగా నిలిచింది.

తుంకిమెట్లలో పొయ్యి వెలగదు!

కొడంగల్, బొంరాస్‌పేట: వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల గ్రామంలో రోజూ సామూహిక భోజనం ఉంటుంది. ఎవరింట్లోనూ వంటలు చేయరు. పదేళ్లుగా దుర్గామాత పూజల్లో ఆనవాయితీ ఇది. గ్రామంలో 1200 మంది జనాభా. నిమజ్జనం రోజు 300 మంది ఏకరూప దుస్తులతో విగ్రహాన్ని తరలిస్తారు.



పెద్దశంకరంపేటలోని గడికోట

అర్ధనారీశ్వరం విశేషం

న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ: సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని సంతోషిమాత దేవాలయంలో నాలుగో రోజున అర్ధనారీశ్వరి అలంకరణ ఉమ్మడి జిల్లాలోనే పేరుగాంచింది. నేటి నుంచి వరుసగా బాలత్రిపురసుందరి, మహాలక్ష్మి, రాజరాజేశ్వరి, అర్ధనారీశ్వరి, లలితాంబిక, అన్నపూర్ణ, సరస్వతి, దుర్గ, మహిషాసురమర్దిని, సంతోషిమాత అవతారాల్లో దర్శనం లభిస్తుంది.



గజ్వేల్ సంతోషిమాత

ఏడుపాయల్లో ఆధ్యాత్మిక పరవళ్లు

పాపన్నపేట, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గామాత ఆలయం ఉత్సవశోభను సంతరించుకుంది. సమీపంలోని గోకుల్ షెడ్‌లో అర్చనలు కొనసాగుతాయి. ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు నేడు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అమ్మవారిని రోజూ వివిధ అవతారాల్లో భక్తులు దర్శించుకుంటారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. దసరా రోజు 15 వేల మందికి పైగా దర్శించుకుంటారు. ఏటా సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి విడుదల ఉంటుంది. ఈ సమయంలో రాజగోపురంలోనే పూజలు జరుగుతున్నాయి. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 8000 క్యూసెక్కుల వరద దిగువకు బుధవారం ప్రవహిస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ విజయ్ కుమార్ తెలిపారు. గురువారం ప్రవాహం మరింత పెరగనుందని ఆయన తెలియజేశారు.



వనదుర్గమ్మ

కమనీయ రూపాలు

▼ మొదటి రోజు శైలపుత్రి ▼ రెండో .. బ్రహ్మచారిణి ▼ మూడో .. చంద్రఘంట ▼ నాలుగో .. కూష్మాండ ▼ ఐదో .. స్కంధమాత ▼ ఆరో .. కాత్యాయని ▼ ఏడో .. కాళరాత్రి ▼ ఎనిమిదో .. మహాగౌరి ▼ తొమ్మిదో .. సిద్ధిధాత్రి ▼ పదో .. రాజరాజేశ్వరి

గతేడాది వాహన పూజలు

ద్విచక్ర .. 100 నాలుగు చక్రాలవి 50 భారీవి .. 20

గతేడాది ప్రసాదాల విక్రయం

లడ్డూలు - 3000 పులిహోర - 2000

ప్రత్యేక పూజలు

● రోజూ ఉదయం 9:30 గంటలకు అర్చనలు ప్రారంభం
● 6వ రోజున మూల నక్షత్రం సందర్భంగా మంగళవారం బోనాలు సమర్పిస్తారు.
● 9వ రోజున మహర్నవమి నేపథ్యంలో సువాసిని పూజ, చండీ హోమం నిర్వహిస్తారు.
● నిత్యం అన్నదానం చేపడతారు.

సరస్వతి నమస్తుభ్యం

వర్గల్, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా వర్గల్ సరస్వతి క్షేత్రంలో సరస్వతి నమస్తుభ్యం మంత్రోచ్చారణ మార్మోగనుంది. ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గురువారం కలశ స్థాపన జరుగుతుంది. 9న మూల నక్షత్రం సందర్భంగా పుష్పగిరి, రంగంపేట, శ్రీక్షేత్రం పీఠాధిపతులు అమ్మవారికి పూజలు నిర్వహించి అనుగ్రహ భాషణం చేయనున్నారు.



వర్గల్ విద్యాధరి

ఆలోచనకు పెద్దపీట



‘ఉపాయం వచ్చినోడు.. ఉపాసం ఉండడు’ ఈ సామెతను చిన్నారులు నిజం చేశారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం ఐనాపూర్‌లో బరువైన పెద్దపీటను కొందరు చిన్నారులు ఓవైపు మోస్తూ మరోవైపు భాగాన్ని సైకిల్‌పై పెట్టి తరలిస్తున్నారు. గణపతి వేడుకలు ముగిసి అమ్మవారి శరన్నవరోత్సవాల కోసం మండపాలు ఏర్పాటు చేశారు. అవసరానికి పీటను ఒకచోట నుంచి మరోచోటకు చేర్చడానికి చిన్నారులు ఇలా ఆలోచన చేశారు. స్థానికులు చూసి ‘భళా పిల్లలు.. భలే చేశారు’ అని మెచ్చుకున్నారు. **- న్యూస్‌టుడే, చేర్యాల**

లారీని ఢీకొన్న స్కార్పియో.. ఒకరి దుర్మరణం

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుక నుంచి స్కార్పియో ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని మాడిగి సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... ముంబయి వైపు వెళ్తున్న స్కార్పియో వాహనం మొగుడంపల్లి మండలం మాడిగి సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టింది. స్కార్పియోలో వెనుక కూర్చున్న హైదరాబాద్ టోలిచౌకికి చెందిన ఆబెద్ కుర్షిద్(50) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాద ఘటనపై ఫిర్యాదు అందలేదని చిరాగ్‌పల్లి ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

సంపులో పడి బాలుడి మృతి



రుద్రాన్ష్

చిన్నకోడూరు, న్యూస్‌టుడే: ఒక్కగానొక్క కొడుకు ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి కళ్లెదుటే మృత్యుఒడికి చేరడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషాదకర ఘటన చిన్నకోడూరు మండలంలోని మైలారం మధిర గ్రామం కమ్మర్లపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలకృష్ణ, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. కమ్మర్లపల్లికి చెందిన బైకని వేణు, రేణుక దంపతులకు ముగ్గురు కుమార్తెలు, మూడున్నరేళ్ల కుమారుడు రుద్రాన్ష్ ఉన్నారు. వారం రోజుల క్రితం వేణు తన ఇంటి ఆవరణలో సంపు నిర్మించి నీటితో నింపాడు. దాని పై కప్పు వేయలేదు. రుద్రాన్ష్ బుధవారం సాయంత్రం ఇంటి ఆవరణలో ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు సంపులో పడిపోయాడు. సుమారు గంట తర్వాత బాలుడు కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు వెతకగా సంపులో పడి ఉన్నాడు. స్థానికుల సాయంతో బాలుడిని బయటకు తీసి చూసే సరికి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే ఓ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



నర్సింహులు

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మెదక్ పట్టణం అవుసులపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఏఎస్‌ఐ శివకుమార్ తెలిపిన ప్రకారం పట్టణానికి చెందిన బొయిని నర్సింహులు (55) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ సభ్యులను పోషిస్తున్నాడు. బుధవారం పొలం గట్టుపై నడుస్తుండగా, కాలు జారడంతో పక్కనే ఉన్న విద్యుత్ నియంత్రిక సపోర్ట్ తీగను పట్టుకున్నాడు. అదే సమయంలో కరెంట్ సరఫరా అవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. నర్సింహులుకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు...



మోహన్

టేక్మాల్, న్యూస్‌టుడే: వ్యవసాయ క్షేత్రం పక్కన ఉన్న గుంతలో పడి ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లాస్‌పూర్ శివారులో బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్సై దయానంద్ తెలిపిన వివరాలు.. టేక్మాల్‌కు చెందిన బాజ మోహన్(29) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతంలో వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం ఉదయం పొలాల పక్కన గుంతలో పడి మృతి చెందిన విషయం స్థానికుల ద్వారా కుటుంబ సభ్యులకు తెలిసింది. రోడ్డు పక్కన మోహన్ ద్విచక్ర వాహనం నిలిపి ఉంది. వాహనంపై రక్తపు మరకలు ఉన్నాయి. కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య సునీత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు	110-00	
రిటైల్	132-00	
డ్రెస్డ్	191-00	
స్కిన్‌లెస్	218-00	

స్టార్టప్‌తో ముందంజ

దుబ్బాక, సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ప్రపంచంలో శాస్త్ర సాంకేతికత రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నేడు చదువుకున్న యువత కొత్తగా ఆలోచిస్తున్నారు. ఉద్యోగాల వేట కంటే ఈతరానికి అనుగుణమైన వ్యాపారాలు చేపడుతున్నారు. ఆన్‌లైన్ షాపింగ్‌ల పేరుతో సరికొత్త స్టార్టప్ కంపెనీలు ప్రారంభిస్తూ సఫలమవుతున్నారు. అలాంటి కోవలోకి చెందిన వారు.. సిద్దిపేట జిల్లాకు చెందిన ఇద్దరు సోదరులు. దుబ్బాక పట్టణానికి చెందిన కిష్టమ్మగారి సందీప్‌రెడ్డి, సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లికి చెందిన నిమ్మ నిఖిల్‌రెడ్డి వరుసకు సోదరులు. వీరు రైతు కుటుంబాలకు చెందిన వారు. సందీప్‌రెడ్డి.. బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ చేశారు. నిఖిల్‌రెడ్డి ఎమ్మెస్సీ బోటనీ చదివారు. విద్యాభ్యాసం పూర్తయ్యాక వీరు భిన్నంగా ఆలోచించి, ఈ-కామర్స్ రంగంలో పోటీ పడాలనే ఆలోచన చేశారు. మూడు నెలల క్రితం హైదరాబాద్‌లోని సుచిత్ర కేంద్రంగా ‘బూకార్ట్ ట్రేడింగ్ స్టోర్స్’ (ఓపీసీ) ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ప్రారంభించారు. దాదాపు రూ.12 లక్షల బ్యాంకు రుణంతో ప్రారంభించారు. వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ వేదిక ఏర్పాటు చేసి, షాపింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఫ్యాషన్ రంగానికి సంబంధించి దుస్తులు, చెప్పులు ఆర్డర్స్ ద్వారా చేయించి ఆన్‌లైన్‌లో పెడుతున్నారు. విక్రయించేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు 1500 ఆర్డర్లు వచ్చాయన్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని వస్తువులను ఆన్‌లైన్ షాపింగ్‌లో అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామని వారు చెప్పారు. కొద్ది రోజుల్లో కంపెనీ యాప్‌ను అందుబాటులోకి తేనున్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వస్తువులను 3, 4 రోజుల్లో వివిధ కొరియర్ కంపెనీల ద్వారా వినియోగదారుల ఇంటికి పంపిస్తున్నారు. వస్తువులకు చెల్లింపులన్నీ ఆన్‌లైన్‌లో డెబిట్, క్రెడిట్, యూపీఐ ద్వారా చెల్లుబాటు అయ్యేట్లు అనుమతులు తీసుకున్నామని చెప్పారు. నాణ్యమైన వస్తువులను అందించే లక్ష్యంతో స్టార్టప్ కంపెనీ ప్రారంభించామని తెలిపారు. సొంత కాళ్లపై నిలబడి, తాము ఎదుగుతూ తమతోపాటు మరికొందరు యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో దీనిని ప్రారంభించామని.. విస్తరిస్తామని చెప్పారు. స్టార్టప్ కంపెనీలు ప్రారంభించాలనే ఆలోచన ఉన్నవారికి ఉచితంగా సూచనలు, సహకారం అందిస్తామంటున్నారు.



సందీప్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి



అతివల ఏకరూపం.. బతుకమ్మల సంబురం

తీరొక్క పూలు తెచ్చి ఆకర్షణీయంగా బతుకమ్మలను మహిళలు పేర్చారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆడిపాడారు. సిద్దిపేట జిల్లా నంగునూరులోని బస్టాండు కాలనీ మహిళలు తాము ప్రత్యేకంగా నిలవాలనే ఉద్దేశంతో ఏకరూప చీరలు ధరించి బతుకమ్మ ఆడారు. – న్యూస్‌టుడే, నంగునూరు

భాస్కరయోగికి సాహిత్య పురస్కారం



పరిగి, న్యూస్‌టుడే: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఏటా అందించే పురస్కారానికి ఆధ్యాత్మిక వేత్త, రచయిత, సామాజిక విశ్లేషకుడు పి.భాస్కరయోగి ఎంపికయ్యారు. వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన ఆయనకు ఈనెల 4న హైదరాబాద్‌లోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పాకాల యశోదారెడ్డి ధర్మనిధి పురస్కారం ప్రదానం చేయనున్నారు. తెలంగాణ సాహిత్య చరిత్రలో చోటు దక్కని 300 మంది వాగ్గేయకారుల కీర్తనలను, జీవితాలను ఆయన పరిశీలించి సాహిత్య లోకానికి ఆయన పరిచయం చేశారు. తెలంగాణ పద సంకీర్తనల పేరుతో సాహిత్య అకాడమీ ఆ పుస్తకాన్ని ప్రచురించింది. సాహిత్య సౌరభాలు పేరుతో ఆయన పరిశోధనాత్మక గ్రంథం వెలువడింది.

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం



నరేష్

నిజాంపేట, రామాయంపేట, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నిజాంపేటలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దండు నరేష్(42) గతంలో దుబాయ్‌కి వెళ్లాడు. ఇటీవల ఇంటికి తిరిగివచ్చాడు. అప్పులు తీర్చలేక, స్థానికంగా పని దొరక్క మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 1న పురుగుమందు తాగాడు. కుటుంబసభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ పొందుతూ బుధవారం మృతి చెందాడు. నరేష్ భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నర్సు ఆత్మహత్య: శివ్వంపేట, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దంతాన్‌పల్లిలో యువతి ఆత్మహత్య చేసుకుంది. శివ్వంపేట ఎస్‌ఐ మహిపాల్ రెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన కుల్ల అంజలి(21) మేడ్చల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా చేస్తోంది. ఆమెకు తల్లి, సోదరుడు, ఇద్దరు అక్కలు ఉన్నారు. తండ్రి గతంలోనే మృతి చెందాడు. తల్లి కూలీ పనులు చేస్తుంటారు. నలుగురు సంతానంలో అంజలి అందరికంటే చిన్న. మంగళవారం దంతాన్‌పల్లిలో బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి సత్తమ్మ వెళ్లి చూడగా ఇంటి ముందున్న చెట్టుకు చున్నీతో ఉరి వేసుకొని కనిపించింది. యువతి మృతికి కారణాలు దర్యాప్తులో తెలుస్తాయని ఎస్‌ఐ చెప్పారు. ఆమె సోదరుడు ఆనంద్ ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.



అంజలి

మంత్రాల నెపంతో కుటుంబ సభ్యులపై దాడి

రామాయంపేట, న్యూస్‌టుడే: మంత్రాల నెపంతో మహిళతో పాటు ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసిన ఘటన రామాయంపేట మండల పరిధి ప్రగతి ధర్మారంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గుర్రం విజయ భర్త సిద్ధిరాములు అదే గ్రామానికి చెందిన పున్న చంద్రం ఇంటి వద్ద చెట్టు కింద నిమ్మకాయలు, పసుపు, కుంకుమ పెట్టి మంత్రాలు చేస్తున్నారని ఆగ్రహించి బుధవారం పది మంది విజయపై దాడి చేశారు. అడ్డు వచ్చిన భర్త సిద్ధిరాములు, వారి కుమారుడినీ కొట్టారు. అనంతరం వారిని చెట్టుకు కట్టేశారు. స్థానికులిచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకొని వారిని కాపాడారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

యోగా శిక్షణ.. ఆరోగ్య రక్షణ

న్యూస్‌టుడే, నర్సాపూర్: సంపూర్ణ ఆరోగ్యం.. మానసిక ప్రశాంతత.. యోగాతోనే సాధ్యం. సరైన సూచనలు, సలహాలు పాటిస్తూ సాధన చేస్తే ఒత్తిడిని జయించవచ్చని అంటున్నారు యోగా సాధకులు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నిత్య జీవన యోగాసాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ భవనం కేంద్రంగా చేసుకుని ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకూ సాధన చేస్తున్నారు. సుమారు 40 మంది క్రమం తప్పకుండా యోగాసానాలు వేస్తున్నారు. ఇటీవల నర్సాపూర్ అర్బన్ పార్కులోని వాచ్ టవర్ వద్ద యోగా శిబిరం చేపట్టారు. రాయరావు చెరువు కట్టపైనా ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ యోగా చేస్తున్నారు. వారంతా సాత్వికాహారం స్వీకరిస్తున్నారు. పట్టణంలో శాకాహార ర్యాలీలు చేపడుతూ అవగాహన కల్పిస్తున్నారు.

కేంద్రం ఏర్పాటుకు యత్నం

సమితి ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో యోగా కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఎకరం విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నారు. ఇందుకు ప్రభుత్వ సహకారం తీసుకోవాలని యోచిస్తున్నారు. రాయరావు చెరువు కేంద్రంగా దీని ఏర్పాటుకు ప్రతిపాదనలు అధికారులకు అందించారు. అటవీ ప్రాంతానికి సమీపంలో నీటి వనరు వద్ద, చల్లని గాలులు, ప్రకృతి సహజ సిద్ధమైన వాతావరణంల నెలకొల్పే ఉద్దేశంతో కేంద్రం కోసం ప్రయత్నిస్తున్నారు.



నర్సాపూర్ చెరువు కట్టపై శిబిరం

గురువుగా విశ్రాంత ఉద్యోగి

శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన యోగా గురువు సురేందర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో విశ్రాంత ఉద్యోగి. రెండు దశాబ్దాల నుంచి ఆసక్తిని పెంచుకున్నారు. వివిధ యోగా సంస్థల్లో ప్రత్యేక శిక్షణ పొందారు. ఉద్యోగ విరమణ అనంతరం యోగా గురువుగా ఆయన తన ప్రస్థానం ప్రారంభించారు. సుమారు 500 పైగా శిక్షణలు చేపట్టారు. సుమారు రెండు వేల మందికి పైగా ఆయన వద్ద శిక్షణ పొందారు. 15 మంది శిక్షకులయ్యారు. వారు స్వతహాగా యోగా శిక్షణా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. పాఠశాలలు, ప్రైవేటు సంస్థలలో ఉచితంగా కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుతం నర్సాపూర్‌లో శిక్షణ కేంద్రం నిర్వహిస్తూ, విజన్ వృద్ధాశ్రమం, మద్యానికి బానిసలైన వారి పునరావాస కేంద్రంలో యోగా తరగతులు చేపడుతున్నారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో సారథి పేరుతో ప్రభుత్వ కేంద్రం ఏర్పాటుకు కృషి చేశారు. కపాలబాతి, ప్రాణాయామం వంటి ఆసనాలు వేయించడంలో ప్రత్యేకత చూపుతున్నారు. యోగా సాధనపై ముందుగా అవగాహన కల్పించి ప్రారంభింపచేస్తారు. గురువు సురేందర్ మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ప్రతి ఒక్కరికీ యోగా భాగం కావాలని ఆకాంక్షించారు. ఆరోగ్య రక్షణకు ఇది దోహదపడుతుందన్నారు.

పూలవనం.. ఆనందమయం



వికారాబాద్ మండలంలోని తట్టేపల్లి వెళ్లే మార్గంలో ఓ రైతు పొలంలో కాశ పూలు, బంతి పూల తోట విశేషంగా చూపరులను ఆకట్టుకుంటోంది. వివిధ రంగులతో అలరిస్తూ బతుకమ్మల రూపకల్పనలో మారేందుకు సిద్ధమయ్యాయి. పరిసరాలను ఆహ్లాదకరంగా మార్చాయి. – న్యూస్‌టుడే, పెద్దేముల్

ఖైదీల్లో మార్పునకు జైళ్ల శాఖ కృషి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఖైదీల్లో మార్పునకు జైళ్లశాఖ అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆ శాఖ డీఐజీ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా కందిలోని కేంద్ర కారాగారంలో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖైదీలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో జైళ్ల శాఖ పెట్రోల్ బంకులు, పరిశ్రమలు నిర్వహిస్తోందని, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్, జైళ్ల శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఖైదీకి బహుమతి అందజేస్తున్న జైళ్ల శాఖ డీఐజీ శ్రీనివాస్

స్కేటింగ్‌లో ఇషాన్ ప్రతిభ



సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో సిద్దిపేట శ్రీసాయి స్కేటింగ్ అకాడమీకి చెందిన చిన్నారి కంచర్ల ఇషాన్ సత్తా చాటాడు. అండర్-7 విభాగంలో 500 మీటర్ల క్వాడ్ స్కేటింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈనెల 4వ తేదీ నుంచి భువనగిరిలో నిర్వహించే తెలంగాణ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాడని శిక్షకుడు సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు యువజన క్రీడల శాఖ జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్‌గౌడ్, సిద్దిపేట స్పోర్ట్స్ కన్వీనర్ పాల సాయిరాం, జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పిండి అరవింద్, ఉపాధ్యక్షుడు పల్లె చంద్రశేఖర్‌గౌడ్, కార్యదర్శి సంతోష్ ఇషాన్‌ను అభినందించారు.

‘హ్యాండ్‌బాల్’కు విద్యార్థుల ఎంపిక


హుస్నాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు హుస్నాబాద్ జడ్పీ బాలుర ఉన్న పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. 3 నుంచి 5 తేది వరకు నారాయణపేట జిల్లా కోస్గిలో పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు తరఫున ఆడనున్నారు. పాఠశాలలో పదోతరగతి చదువుతున్న ఎం.శివబాలాజీ బాలుర విభాగంలో, కె.ప్రశాంత బాలికల విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పీడీ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాసుదేవరెడ్డి, పురాధ్యక్షురాలు రజిత, ఎంఈవో మనీలా అభినందించారు.



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు వాసుదేవరెడ్డి

రాష్ట్రస్థాయి పోటీలకు ఆకునూరు బాలలు

చేర్యాల, న్యూస్‌టుడే: ఇటీవల సిద్దిపేటలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీల్లో చేర్యాల మండలం ఆకునూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ఆకునూరులో చిన్నారులు ఎం.సాత్విక, సీహెచ్. భార్గవి, వి.శిరీష, టి.దివ్యశ్రీని అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ప్రధానోపాధ్యాయుడు ఐలయ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.కవిత ఆకాంక్షించారు.



విద్యార్థినులతో ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయురాలు

పెద్దశంకరంపేటలో వర్షం

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: పెద్దశంకరంపేట మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో వీధులు, రహదారులు జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం రాత్రి తీవ్రమైన ఉక్కపోత నుంచి స్థానికులు ఉపశమనం పొందారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: స్వచ్ఛత హీ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కావేరి సీడ్స్ పరిశ్రమ మేనేజర్ రంగ పరమేశ్వర్ పిలుపునిచ్చారు. బుధవారం ఖాజాపూర్‌లో పరిశ్రమ శివారులో పటేల్ చెరువు వద్ద కార్మికులతో కలిసి స్వచ్ఛ భారత్ చేపట్టారు.

మనోహరాబాద్: గాంధీ జయంతి సందర్భంగా దండుపల్లిలోని పల్లె ప్రకృతి వనంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, గ్రామస్థులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. చెత్తాచెదారం తొలగించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి హేమలత, మహేందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

తుప్పపట్టిన బోర్డులు.. కనిపించని మైలురాళ్లు

● దారులు తెలియక చోదకుల ఇబ్బందులు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెలసిన బోర్డులు.. కనిపించని మైలురాళ్లతో ఏ దారి ఎటువైపు పోతుందో తెలియని పరిస్థితి. ఇక కూడళ్ల వద్ద అయితే చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని బాగు చేసే విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, పీడబ్ల్యూడీ శాఖలు గ్రామాల వద్ద బోర్డులు, రోడ్ల పక్కన మైలురాళ్లను ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి కొత్తగా వచ్చే ప్రయాణికులు, వాహనదారులకు ఇవి ఉపయోగకరంగా ఉంటాయి. గ్రామాల పేర్లు తెలిపే బోర్డులకు, మైలురాళ్లకు గతంలో ప్రతి సంవత్సరం రంగులు వేసి, గ్రామాలు, పట్టణాల పేర్లను, మైలురాళ్లపై అంకెలను రాయించేవారు. అలాగే ప్రతి ఏటా వీటి చుట్టూ ఉండే పొదలు, చెట్లను తొలగించేవారు. ఈ పనులు చేయడానికి ప్రతి శాఖలో కచ్చితంగా గ్యాంగ్‌మెన్లు ఉండేవారు. వర్షాకాలంలో రోడ్లపై వర్షం నీరు నిల్వకుండా సాఫీగా వెళ్లేలా కాల్వలు చేసేవారు. దీంతో రోడ్లు శిథిలం కాకుండా ఉండడంతో పాటు బోర్డులు, మైలురాళ్లు ప్రయాణికులకు, వాహనదారులకు స్పష్టంగా కనిపించేవి. ప్రస్తుతం గ్యాంగ్‌మెన్ల వ్యవస్థను పూర్తిగా తొలగించారు. రోడ్లకు మరమ్మతులు జరిగినప్పుడో లేదా పునర్నిర్మాణం చేసినప్పుడే పునరుద్ధరిస్తున్నారు.


కొత్తపల్లి శివారులో పొదలలో కనిపించని మైలురాళ్లు


రామాయపల్లి వద్ద రంగులు వెలసి తుప్పు పట్టిన బోర్డు

ఉమ్మడి వెల్దుర్తి మండల వ్యాప్తంగా..

ఉమ్మడి వెల్దుర్తి మండలంలో 30 పంచాయతీలు ఉన్నాయి. ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రహదారులపై గల సూచిక బోర్డులు, గ్రామాల పేర్లు తెలిపే బోర్డులు రంగులు వెలసి, తుప్పు పట్టి, చుట్టూ పొదలు, చెట్లు పెరిగి దర్శనమిస్తున్నాయి. మైలురాళ్లు ఎక్కడికక్కడ శిథిలమై అసలు కనిపించడం లేదు. ఇక మలుపుల వద్ద సూచిక బోర్డులు అసలే లేవు. ఎస్.. యూ.. ఇలా రకరకాల మలుపులు ఉంటాయి. సూచిక బోర్డులు లేక వాహనదారులు వేగంగా వెళ్లడంతో అదుపుతప్పి బోల్తా పడి గాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

భాజపా ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు

వెల్దుర్తి(మాసాయిపేట), న్యూస్‌టుడే: మాసాయిపేట మండలంలో భాజపా మండల అధ్యక్షుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రక్రియ బుధవారం కొనసాగింది. ప్రజలు ఉత్సాహంగా వచ్చి భాజపా సభ్యత్వం పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ కమిటీల అధ్యక్షులు, ఇన్‌ఛార్జులు, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి

రేగోడ్, న్యూస్‌టుడే: వాహనదారులు రహదారి భద్రత నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్సై పోచయ్య అన్నారు. బుధవారం పోచారం కూడలిలో వాహనాల తనిఖీ చేసి మాట్లాడారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, సంబంధిత పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం నిషేధించిన వాటిని రవాణా చేస్తే వాహన యాజమానితో పాటు డ్రైవర్‌పై కేసులు నమోదు చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాలయ అమావాస్య

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో బుధవారం మహాలయ అమావాస్య పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పితృదేవతలు,పెద్దల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మాజీ మంత్రులపై ఫిర్యాదు

మెదక్, న్యూస్‌టుడే: మంత్రి కొండా సురేఖపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టేందుకు ప్రోత్సహించిన మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుపై చర్యలు తీసుకోవాలని పట్టణ సీఐ నాగరాజుకు మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజుద్దీన్, నాయకులు రవికుమార్, నాగిరెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు.


మెదక్‌లో మహాత్ముడికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి


మెదక్ టీఎన్జీవో భవనంలో జిల్లా అధ్యక్షుడు నరేందర్


నర్సాపూర్ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి


చేగుంటలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు..


తూప్రాన్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు


రామాయంపేటలో పుర ఛైర్మన్ జితేందర్‌గౌడ్

మహాత్ముడి ఆశయాలే స్ఫూర్తి

మహాత్మా గాంధీ ఆశయాలే స్ఫూర్తి కావాలి.. ఆయన అడుగుజాడల్లో నడవాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి కోరారు. బుధవారం గాంధీజీ జయంత్యుత్సవాలను నర్సాపూర్‌లో నిర్వహించారు. డివిజన్ కార్యాలయం ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేశారు. ఊరూరా పలువురు రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ కులసంఘాల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళి అర్పించారు. శివ్వంపేట మండలం గోమారంలో ఎమ్మెల్యే సునీతా రెడ్డి, తూప్రాన్‌లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, రామాయంపేటలో పుర ఛైర్మన్ జితేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. –న్యూస్‌టుడే, బృందం


నర్సాపూర్‌లో పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో

శిక్షణ సద్వినియోగం చేసుకోండి

సిద్దిపేట, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని యూబీఐ సీజీఎం(చీఫ్ జనరల్ మేనేజర్) కె. భాస్కరరావు, రీజినల్ అధికారి ఈద వికాస్ సూచించారు. యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ నూతన భవనాన్ని బుధవారం వర్చువల్ విధానంలో ముంబాయి నుంచి యూబీఐ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో మణిమేఖలాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్దిపేటలో హాజరైన భాస్కర్‌రావు, వికాస్ మాట్లాడుతూ.. అత్యాధునిక సదుపాయాలతో భవనం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఎనిమిదేళ్ల వ్యవధిలో 5400 మందికి ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఉచిత భోజనంతో పాటు వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. ఎల్‌డీఎం హరిబాబు, డైరెక్టర్ రాజలింగం, శిక్షకులు నజీమ్, బ్యాంకుల అధికారుల పాల్గొన్నారు.

ఆత్మగౌరవానికి ప్రతీక.. బతుకమ్మ వేడుక


చేగుంటలో..

బతుకమ్మ సంబరాల్లో భాగంగా మొదటిరోజు బుధవారం ఎంగిలిపూలతో తయారుచేసిన బతుకమ్మ వద్ద మహిళలు ఆడిపాడారు. లింగారెడ్డిపేటలో భాజపా గ్రామ అధ్యక్షుడు విజయ్ 1000 జతల కోలలను పంపిణీ చేశారు. కొల్చారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉత్సవాలను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లోని కూడళ్ల వద్ద మొదటిరోజు సంబరాల్లో పాల్గొన్న మహిళలు చెరువు వద్దకు వెళ్లి బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

న్యూస్‌టుడే, బృందం:


మెదక్ పట్టణం వీర హనుమాన్ కాలనీలో..


లింగారెడ్డిపేటలో బతుకమ్మ ఆడుతున్న యువతులు



అసంపూర్తిగా పీహెచ్‌సీ భవనం

చిన్నశంకరంపేట మండలం మడూరులో 2023లో ప్రాథమిక వైద్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. దశల వారీగా పనులు చేపట్టినా ఏడాదిగా అడుగు ముందుకు పడలేదు. వైద్యశాల భవనం పూర్తిచేసేందుకు ఇంకెన్నాళ్లు పడుతుందని గజగట్లపల్లి, శాలిపేట, చెన్నాయపల్లి, వెంకట్రావ్‌పల్లి గ్రామస్థులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. జ్వరం వస్తే వైద్యానికి 10 కి.మీ దూరంలో ఉన్న చిన్నశంకరంపేట పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు లేని సమయంలో ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చొరవ తీసుకుని అసంపూర్తి భవనం పూర్తయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, చిన్నశంకరంపేట

నేడు నర్సాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

నర్సాపూర్, న్యూస్‌టుడే: పట్టణంలోని పురపాలిక కార్యాలయం ఆవరణలో గురువారం ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పురపాలిక అధ్యక్షులు అశోక్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గౌతాపూర్ హనుమాన్ ఆలయ పునఃనిర్మాణ పనులకు హైదరాబాద్ షాపూర్‌నగర్ చెందిన యూసుఫ్ అతని మిత్రులు కలిసి రూ.51వేలు విరాళంగా బుధవారం అందజేశారు. హిందూ ఆలయ నిర్మాణానికి ముస్లిం యువకుడు నగదు విరాళంగా ఇవ్వడం హర్షణీయమని కమిటీ సభ్యులు అన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు

శివ్వంపేట: కులం పేరుతో దూషిస్తే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి మాదిగ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు హైదరాబాద్‌లో ఉద్యోగుల సమావేశంలో మాదిగలను కించపరుస్తూ, మంద కృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల ఖండించారు.

ఉపాధి పనుల గుర్తింపు.. సమస్యలపై తీర్మానం

రామాయంపేట, శివ్వంపేట, చిన్నశంకరంపేట, కౌడిపల్లి, నర్సాపూర్ రూరల్, వెల్దుర్తి, న్యూస్‌టుడే: ప్రజలకు ఉపయోగపడే పనులను ఉపాధి హామీలో సూచించాలని, స్వచ్ఛ అక్కన్నపేటగా తీర్చిదిద్దాలని డీఆర్‌డీవో శ్రీనివాస్ సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం రామాయంపేట మండల పరిధి అక్కన్నపేటలో గ్రామసభలో నిర్వహించిన ప్రగతి పనులపై చర్చించారు. ఎంపీడీవో షాజిలోద్దీన్, కార్యదర్శి సరిత ఉన్నారు. శివ్వంపేట గ్రామసభలో రైతులు పాంపాండ్లు నిర్మించుకోవాలని తీర్మానం చేశారు. కార్యదర్శి రమాదేవి పాల్గొన్నారు. చిన్నశంకరంపేట ఎంపీడీవో దామోదర్ చందాపూర్‌లో గ్రామసభ ఏర్పాటు చేసి వచ్చే ఏడాది ఉపాధి హామీ ద్వారా చేపట్టబోయే పనులను గ్రామస్థులకు వివరించారు. ఖాజాపూర్‌లో


రామాయంపేటలో పాల్గొన్న డీఆర్‌డీవో శ్రీనివాస్


ఉప్పులింగాపూర్‌లో నిర్వహిస్తున్న గ్రామ సభ

ఏపీవో రాజ్‌కుమార్ గ్రామస్థులతో చర్చించారు. కౌడిపల్లి పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉపాధి పథకం ద్వారా 266 రకాల పనులను చేసుకోవడానికి అవకాశం తెలిపారు. ఎంపీవో కలీముల్లా, ఏపీవో పుణ్యదాస్, కార్యదర్శి వెంకటేశం పాల్గొన్నారు. నర్సాపూర్‌లో మండలంలోని అవంచలో ఎంపీడీవో మధులత మాట్లాడుతూ..ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. నత్నాయిపల్లి గ్రామసభ నిర్వహించారు. ఉమ్మడి వెల్దుర్తి మండల వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు అధ్యక్షతన సభలు నిర్వహించారు. 2024-2025 సంవత్సరానికి సంబంధించి చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి పనుల ప్రణాళికలను తయారు చేశారు.

రద్దీ రోడ్డు.. గుంతలతో పాట్లు

మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా నుంచి ముత్తయ్యకోట-సర్దన వెళ్లే రోడ్డు విస్తరణ పనులను కొన్ని నెలల క్రితం ప్రారంభించారు. నెలలు గడుస్తున్నా పనులను మధ్యలోనే నిలిపివేయడంతో ఆ రోడ్డు గుంతలమయంగా మారింది. ప్రతి రోజు వందల మంది ఈ మార్గంలో సంచరిస్తుండడంతో రద్దీగా ఉంటుంది. దీనికి తోడు ఆ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారులు ప్రయాణించే క్రమంలో అదుపు తప్పి పడిపోతున్నారు. అధికారులు గుంతలను పూడ్చివేయించాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, మెదక్ టౌన్



మద్యం దుకాణాలపై అధికారుల దాడులు

మనోహరాబాద్, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా మాంసం, మద్యం విక్రయాలు నిషేధం ఉన్నప్పటికీ అమ్మకాలు చేపట్టిన దుకాణాలపై దాడులు చేసి జరిమానాలు విధించినట్లు మండల పంచాయతీ అధికారి లక్ష్మీనర్సింలు తెలిపారు. బుధవారం మండలంలోని ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామికవాడ, కూచారం ఓ దుకాణంలో మాంసం అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారంతో దుకాణాలపై దాడి చేసి ఒక్కొక్కరికి రూ. 4వేల చొప్పున జరిమానా విధించామన్నారు. పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, స్వామి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

శివ్వంపేట, న్యూస్‌టుడే: సీఎం సహాయనిధి పేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా సూరారం పట్టణానికి చెందిన జె.గోపాల్‌కు అత్యవసర చికిత్స నిమిత్తం మంజూరైన రూ.లక్ష ఎల్వోసీ పత్రాన్ని గోమారంలో తన నివాసంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

శివ్వంపేట, న్యూస్‌టుడే: బిజిలిపూర్‌లోని డప్పు నరింలుకు చెందిన గేదె గ్రామ శివారులోని ఓ పొలంలో విద్యుదాఘాతంతో బుధవారం మృతిచెందింది. పొలానికి విద్యుత్తు కంచె ఏర్పాటు చేయడంతో గేదె వాటిని తగలడంతో ప్రమాదం జరిగింది.

ప్రభుత్వ స్తంభాలపై ప్రైవేట్ పెత్తనం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: మెదక్ పట్టణంలోని ప్రధాన రోడ్లయిన జెఎన్ఎన్ రోడ్డు, కూరగాయల మార్కెట్, పెద్దబజార్, చమాన్- తపాలా కార్యాలయం రోడ్డు, ప్రభుత్వ ఆస్పత్రి మార్గం, అంజపూర తదితర మార్గాల వెంట ఉన్న విద్యుత్తు స్తంభాలకు కేబుళ్ల వైర్లు ఇష్టానుసారంగా ఏర్పాటు చేశారు. దీంతో అవి ప్రమాదకరంగా మారాయి. మెదక్ పట్టణంలో విద్యుత్తు స్తంభాలపై ప్రైవేట్ పెత్తనం కొనసాగుతోంది. వివిధ రకాల కంపెనీలకు చెందిన కేబుళ్లు స్తంభాలకు కింద నుంచి పై వరకు కట్టలు కట్టలుగా చుట్టారు. విద్యుత్తు సరఫరాకు ఆటంకం కలిగిన సమయంలో మరమ్మతులు చేయడానికి సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని తీగలు కుప్పలుగా ఉండటంతో సమస్యను సకాలంలో గుర్తించలేకపోతున్నారు. దీంతో ఒక్కోసారి గంటల తరబడి మరమ్మతులు చేపట్టినా పరిష్కారం కావడం లేదు. దీంతో విద్యుత్తు శాఖ అధికారుల సమయం వృథా అవుతోంది. కొన్ని కేబుల్ తీగలు కిందకి వేలాడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.


పిట్లంబేస్‌లోని విద్యుత్తు స్తంభానికి ఉన్న కేబుల్ తీగలు

ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు లేవు

–జావిద్, ఏఈ, మెదక్ పట్టణం

విద్యుత్తు స్తంభాలపై కేబుల్ వైర్లు ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన మాట వాస్తవమే. వీటి వలన విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు సిబ్బంది స్తంభాలపైకి ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయి. హైదరాబాద్‌లోని స్తంభాలపై ఉన్న కేబుళ్లు, తీగలను తొలగిస్తున్నారు. ఇక్కడ అలాంటి ఆదేశాలు రాలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

పటాన్‌చెరు అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పటాన్‌చెరు ఎస్సై వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా టేక్మాల్‌కు చెందిన దంపతులు పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ వీకర్‌సెక్షన్ కాలనీలో ఉంటోంది. ఆ దంపతుల కుమార్తె(20) స్థానికంగా డిగ్రీ చదువుతోంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం తల్లిదండ్రులు, సోదరుడు బయటకు వెళ్లిన సమయంలో చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మోసం చేస్తున్న వ్యక్తి అరెస్టు

మెదక్, న్యూస్‌టుడే: అవసరముందని నగదు తీసుకుని, తిరిగి ఆన్‌లైన్ ద్వారా పంపకుండా మోసం చేస్తున్న వ్యక్తిని పట్టణ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పట్టణ సీఐ నాగరాజు తెలిపిన ప్రకారం గత నెల 14వ తేదీన మెదక్ పట్టణం ఎస్‌బీఐ ప్రధాన బ్యాంకు ఏటీఎం వద్ద ఓ వ్యక్తి రూ. 5 వేలు డిపాజిట్ చేసేందుకు రాగా, అల్లాదుర్గం మండలం ముస్లాపూర్‌కు చెందిన బేగరి అరవింద్ అక్కడికి వచ్చి నగదు అవసరం ఉంది, ఫోన్‌పే చేస్తా అని నమ్మించి, డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వలేదు. ఈ విషయమై బాధితుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి, అరవింద్‌ను అదుపులోకి తీసుకున్నారు. తప్పుడు సందేశం చూపి మోసం చేస్తున్నాడని, ఇతనిపై గతంలో వివిధ పోలీస్ స్టేషన్లలో నాలుగు కేసులు నమోదయ్యాయని సీఐ తెలిపారు.

వేంకటేశ్వరాలయంలో చోరీ

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: చారిత్రక వేంకటేశ్వరాలయంలో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడిన సంఘటన అల్లాదుర్గంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, పురోహితులు శిలాంకోట ప్రవీణ్ శర్మ తెలిపిన వివరాలు. .బుధవారం ఆలయానికి భక్తులు రావడంతోనే ధ్వంసమైన హుండీని గుర్తించి చోరీ జరిగినట్లు భావించారు. విషయం గ్రామస్థులకు తెలియడంతో ఆలయం వద్దకు చేరుకొని సీసీ కెమెరాలను పరిశీలించారు. మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. కాళ్లకు బూట్లు వేసుకొని ఆలయాన్ని అపవిత్రం చేయడంపై తీవ్రంగా ఖండించారు. అనంతరం గ్రామంలోని రహదారిపై నిరసన తెలిపారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై ప్రవీణ్‌రెడ్డిని సంప్రదించగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


అల్లాదుర్గంలో భక్తుల నిరసన

బోర్డుకే పరిమితం.. క్రీడా ప్రాంగణం

మండలంలోని తుజాల్‌పూర్‌లో తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు బోర్డుకే పరిమితమైంది. గత ప్రభుత్వం లక్ష్యాల మేరకు అధికారులపై ఒత్తిడి తేవడంతో తూతూమంత్రంగా దీనిని ఏర్పాటు చేసి మమ అనిపించారు. ఇందులో ఎలాంటి ఆట వస్తువులు లేక వినియోగంలోకి తీసుకురాలేదు. పట్టించుకునే వారే కరవవడంతో క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. –న్యూస్‌టుడే, నర్సాపూర్



విధులకు ఆటంకం కలిగించారని ఠాణాలో ఫిర్యాదు

రామాయంపేట, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శిని దూషించడంతో పాటు ఆమె విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా మండల పరిధి పర్వతాపూర్ కార్యదర్శి లక్ష్మి పంచాయతీ కార్యాలయం సమీపంలో గ్రామసభ నిర్వహించారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కట్ట లక్ష్మన్ ఆమె విధులకు ఆటంకం కలిగించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

అట్రాసిటీ కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

మనోహరాబాద్, న్యూస్‌టుడే: మనోహరాబాద్ మండలంలోని గౌతోజీగూడెంలో కులబహిష్కరణ కేసులో 31 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడు గ్రామ మాజీ ఉపసర్పంచి రేణుకుమార్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు.